www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 26 జనవరి 2024



సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి

తాడేపల్లిగూడెం:విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి తెలిపారు. నిట్‌లో బిటెక్, ఎంటెక్ విద్యార్థులకు ఎంబిఎ కోర్సుపై గురువారం సాయంత్రం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (ఐఐఎం) ఏపి నిట్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు క్యాట్ ప్రవేశ పరీక్ష రాయకుండానే ఎంబిఏ, డిప్లొమా ఇన్ మేనేజ్మెంట్ కోర్సుల్లో చదువుకునే సువర్ణ అవకాశాన్ని కల్పిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐఐఎం ఆచార్యులు షమీమ్ మాట్లాడుతూ ఇంజినీరింగ్‌తోపాటు ఎంబిఏ చదివిన విద్యార్థులకు ఎన్నో ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ జిబి.వీరేష్ కుమార్, డాక్టర్ కురుమయ్య ఆచార్యులు సౌమ్య పాల్గొన్నారు.

పట్టు కోసం పాట్లు..

పూర్వ వైభవం కోసం తెలుగు తమ్ముళ్ల తహతహ

ఈసారీ మాదే ఆధిక్యమంటున్న అధికార పక్షం

జనసేన, టిడిపి సీట్ల సర్దుబాటుపై కానరాని స్పష్టత

రసవత్తరంగా ఉమ్మడి పశ్చిమగోదావరి రాజకీయం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో రాబోయే ఎన్నికల్లో తమ పట్టు నిలుపుకునేందుకు రాజకీయ పార్టీలు తహతహలాడుతున్నాయి. గత వైభవాన్ని సాధించేందుకు టిడిపి గట్టి ప్రయత్నం చేస్తుండగా.. గత ఎన్నికల్లో వలే ఈసారి మాదే ఆధిక్యమని అధికారపక్షమైన వైసిపి ధీమా వ్యక్తం చేస్తోంది. అయితే టిడిపి, జనసేన సీట్ల సర్దుబాటుపై స్పష్టత లేకపోవడంతో ఎవరు ఏస్థానం నుంచి బరిలో ఉంటారో తెలియక గందరగోళ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఎవరికి వారు జిల్లాపై పట్టు కోసం కసరత్తు చేస్తుండటంతో జిల్లా రాజకీయ రసవత్తరంగా మారింది.



ప్రజాశక్తి - భీమవరం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఒకప్పుడు టిడిపి బలంగా ఉండేది. గోదావరి జిల్లాలే రాష్ట్ర రాజకీయాలను శాసిస్తాయనే నానుడి ఇప్పటికే ఉంది. గోదావరి జిల్లాల్లో సత్తా చాటిన పార్టీనే అధికారం చేపడుతుందనేది అందరి నోటిమాట. గత ఎన్నికల్లో ఈ జిల్లాలో వైసిపి సత్తా చాటింది. 2014 ఎన్నికల్లో టిడిపి, బిజెపి కూటమి జనసేన మద్దతుతో జిల్లాలోని అన్నిస్థానాలను చేజిక్కించుకుంది. ఆ ఎన్నికల్లో వైసిపికి నిరాశే మిగిలింది. 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలతో పాటు 13 అసెంబ్లీ స్థానాల్లో వైసిపి, పాలకొల్లు, ఉండి స్థానాల్లో టిడిపి గెలుపొందాయి. జిల్లాల విభజన తర్వాత పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గం ఉంది. ఏలూరు జిల్లాలోనూ అదే పరిస్థితి. జిల్లాల విభజన తర్వాత జరుగుతున్న తొలి సార్వత్రిక ఎన్నికలు కావడంతో విభజిత పశ్చిమగోదావరి జిల్లా రాజకీయం ఆసక్తికరంగా మారింది.

గోదావరి జిల్లాలపై కన్ను..

రానున్న ఎన్నికలు టిడిపికి జీవన్మరణ పోరాటంగా మారాయి. ఎలాగైనా ఈసారి అసెంబ్లీలో అడుగు పెట్టాలనేది జనసేనాని పట్టుదల. టిడిపి, జనసేన మధ్య పొత్తును ఇప్పటికే ప్రకటించి సమన్వయంతో ఎన్నికల ప్రచారాన్ని సైతం ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో అధికారం చేజిక్కించుకునేందుకు ఇరుపక్షాలు గోదావరి జిల్లాలపై కన్నేశాయి. ఈ నేపథ్యంలో టిడిపి, జనసేన జిల్లాపై పట్టు సాధించేందుకు సీట్ల సర్దుబాటు దగ్గర నుంచి అభ్యర్థుల ఎంపిక వరకూ అన్ని అంశాలనూ క్షుణ్ణంగా పరిగణలోకి తీసుకుంటున్నాయి. ఉమ్మడి అభ్యర్థులను పోటీలో నిలిపే చోట సామాజిక తరగతుల బలబలాలు, వైసిపి అభ్యర్థులపై వ్యతిరేకత, అభ్యర్థుల ఆర్థిక బలబలాలపై అంచనాలు రూపొందిస్తున్నారు.

పొత్తుతో త్యాగం తప్పదా..!

ఎన్నో ఆశలతో పొత్తుతో ఎన్నికల బరిలోకి దిగుతున్న టిడిపి, జనసేన ఎవరు ఏ స్థానం నుంచి రంగంలో ఉంటారనేది తేలకపోవడం ఇరుపార్టీల శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. జనసేన మూడు సీట్లు ఆశించే అవకాశం కనిపిస్తోంది. ఎక్కువ సీట్లు ఆశించినా ఆ సంఖ్యకే పరిమితమవుతుందని తెలుస్తోంది. మిగిలిన అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో టిడిపి బరిలో దిగుతుందని చర్చ సాగుతోంది. భీమవరం అసెంబ్లీ సీటు కోసం జనసేన పట్టుబడుతున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇక్కడ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. రానున్న ఎన్నికల్లో ఆయన ఇక్కడ నుంచి మళ్లీ పోటీ చేసే అవకాశం ఉందా, లేక వేరే అభ్యర్థిని బరిలోకి దింపుతారా అనేది తేలాల్సి ఉంది. ఏదేమైనా ఇక్కడ టిడిపి ఆశావహులు త్యాగం చేయక తప్పని పరిస్థితి కన్పిస్తోంది. నరసాపురం అసెంబ్లీ స్థానాన్నీ జనసేన కోరుతోంది. గత ఎన్నికల్లో ఇక్కడ జనసేన రెండోస్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో జనసేన కోరిక మేరకు ఈ సీటు ఇచ్చేస్తే ఇక్కడి టిడిపి ఆశావహుల ఆశలన్నీ గల్లంతే. తాడేపల్లిగూడెం స్థానం కోసం కూడా జనసేన పట్టుబడుతున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో ఆ పార్టీకి మూడోస్థానం దక్కింది. అయితే అంతకుముందు ఇక్కడ బిజెపి విజయఢంకా మోగించింది. అయితే ఇక్కడ 2004 నుంచి టిడిపికి కలిసిరావడం లేదనే అభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలో ఈ సీటు జనసేనకు వదిలేసే అవకాశం ఉందని టిడిపి శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

టిడిపి కచ్చితంగా బరిలోకి దిగే స్థానాలు..

జిల్లాలో ఉండి, పాలకొల్లు, ఆచంట, తణుకు స్థానాల నుంచి టిడిపి కచ్చితంగా బరిలోకి దిగనుంది. ఈ సీట్లను టిడిపి వదులుకునే పరిస్థితి లేదు. ఉండి, పాలకొల్లు టిడిపికి బలమైన స్థానాలు. గత ఎన్నికల్లో వైసిపి ప్రభంజనాన్ని సైతం తట్టుకుని టిడిపి ఈ స్థానాల్లో గెలుపొందింది. ఆచంట, తణుకుల్లోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ టిడిపికి బలమైన అభ్యర్థులు ఉన్నారు. ఇక అధికార పక్షమైన వైసిపి జిల్లాలో అభ్యర్థులను ఒకటి, రెండుచోట్ల మినహా పెద్దగా మార్చే అవకాశం ఉండదని చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న సిట్టింగులకు ఆయాస్థానాల్లో కాకపోయినా వేరేచోట కచ్చితంగా టిక్కెట్ దక్కుతుందని ప్రచారం సాగుతోంది. ఏదేమైనా కాంగ్రెస్ రాక, తదితర పరిణామాల నేపథ్యంలో జిల్లా రాజకీయం రసవత్తరంగా మారింది.



వేడుకలకు సిద్ధం చేసిన సభా వేదిక

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా కలెక్టరు ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక కలెక్టరేట్ మైదానంలో శుక్రవారం నిర్వహించబోయే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను గురువారం కలెక్టర్ పరిశీలించారు. మూడు పెద్ద సభా వేదికలు, రెండు చిన్న సభా వేదికలు, ఒక గ్యాలరీ, 14 స్టాల్స్, వివిధ శాఖలకు సంబంధించి 10 శకటాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రోటోకాల్ అనుసరించి కుర్చీలు, స్టేజీ, తాగునీటి సరఫరా ఏర్పాట్లను పటిష్టంగా ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్తు సరఫరాలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని, జనరేటర్ ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, మాస్కులు, సానిటైజర్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు, అంబులెన్స్ సేవలు సిద్ధం చేశామన్నారు. వేడుకలు ఘనంగా నిర్వహించేలా సమన్వయంతో పనిచేయాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రేక్షకులు వీక్షించేలా ఏర్పాట్లు చేశామన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ కె.శ్రీనివాసులు రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

ఫిబ్రవరిలో తాడేపల్లిగూడెంలో జగన్ పర్యటన

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం:ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిగూడెం పర్యటనకు రానున్నట్లు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో గురువారం జరిగిన 'ఆడుదాం ఆంధ్ర' నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాడేపల్లిగూడెంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 12 ఎకరాల స్థలంలో గ్రౌండ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్రికెట్‌తో పాటు హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్ వంటి క్రీడలు ఆడుకోవచ్చన్నారు. వచ్చే నెల ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి తాడేపల్లిగూడెంలో పర్యటిస్తారని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. దీనిలో భాగంగా 12 ఎకరాల్లో ఏర్పాటు చేసే స్పోర్ట్స్ గ్రౌండ్‌కు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

ప్రాణం తీసిన పానీపూరీ..!

- గంటల వ్యవధిలో కడుపునొప్పితో అన్నదమ్ముల మృతి
- ఫుడ్ పాయిజనే కారణమని అనుమానాలు
- జంగారెడ్డిగూడెంలో పెను విషాదం



మృతి చెందిన చిన్నారులు (ఫైల్ ఫొటో)


ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం (టి.నర్సాపురం)

అప్పటి వరకూ ఆడుతూ.. పాడుతూ తిరిగారు తల్లిదండ్రులతో కలిసి పానీపూరీ తిన్నారు. ఆపై ఇంటికెళ్లి కొద్దిసేపటి తర్వాత భోజనం చేసి పడుకున్నారు. నిద్రలోనే తీవ్ర అస్వస్థతకు గురైన వారు తెల్లవారేసరికి విగత జీవులయ్యారు. చిన్నారుల మృతికి ఫుడ్ పాయిజనే కారణమని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అన్నదమ్ములైన బి.రామకృష్ణ (11), విజయ్ (6) కడుపునొప్పితో గురువారం ఉదయం గంటల వ్యవధిలో మృతి చెందడం జంగారెడ్డిగూడెంలో తీవ్ర విషాదాన్ని, ఆందోళనను రేకెత్తించింది.

ఈ ఘటనకు సంబంధించి జంగారెడ్డిగూడెం డిఎస్‌పి ధనుంజయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా నంద్యాల ప్రాంతానికి చెందిన బేలపాటి రవి, చిన్న జమక్క భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు రామకృష్ణ (11), విజయ్ (6) ఉన్నారు. ఈ కుటుంబం రిక్షాపై తిరుగుతూ ప్లాస్టిక్ వస్తువులు ఏరుకుని జీవనం సాగిస్తోంది. రెండు నెలల క్రితం జంగారెడ్డిగూడెం వచ్చిన వీరు ఏలూరు రోడ్డులోని రామచంద్రపురంలో ఖాళీ స్థలంలో గుడారాలు వేసుకుని నివాసముంటున్నారు. ఎప్పటిలానే ప్లాస్టిక్ వస్తువులు ఏరుకుని స్థానికంగా విక్రయించాక బుధవారం సాయంత్రం ఏలూరు రోడ్డులో ఉన్న పానీపూరీ బండి వద్దకు తమ ఇద్దరు కుమారులతో కలిసి వెళ్లి పానీపూరీ తిన్నారు. అనంతరం రాత్రి భోజనం చేసి పడుకున్నారు. అయితే గురువారం తెల్లవారుజామున మూడు గంటలకు చిన్న కుమారుడు విజయ్‌కు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో స్థానిక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో రాజమండ్రి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదే సమయంలో ఉదయం 6:30 గంటల సమయంలో పెద్ద కుమారుడు రామకృష్ణ కూడా కడుపునొప్పి వస్తుందనడంతో స్థానిక ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించగా పరిస్థితి మెరుగుపడలేదు. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో కామవరపుకోట వెళ్లేసరికి మతి చెందినట్లు బంధువులు చెబుతున్నారు. ఈ విషయం తెలియగానే డిఎస్‌పి ధనుంజయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిన్నారులు తిన్న ఆహారాన్ని సీజ్ చేసి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పొట్టికూకోసం వచ్చిన కుటుంబం ఇద్దరు చిన్నారులను కోల్పోవడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో తీవ్ర ఆందోళన రేకెత్తించింది.

మృతుల కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సిపిఎం ఆందోళన

ఫుడ్ పాయిజన్ అయ్యి మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ నేతలు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించింది. అనంతరం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బి.రాంబాబు అధ్యక్షతన చేపట్టిన ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, మండల కార్యదర్శి జీవరత్నం మాట్లాడారు.



సభలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షురాలు షర్మిల

వైసిపి, టిడిపి, జనసేన బిజెపి తొత్తులే

ప్రత్యేక హోదాపై ఆ పార్టీలు మోసగించాయి

పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, దాని మిత్రపక్షం జనసేన బిజెపి తొత్తులేనని, వాటికి ఓట్లేస్తే బిజెపికి వేసినట్లేనని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అన్నారు. ప్రత్యేక హోదా విషయంలో వైసిపి, టిడిపి రాష్ట్ర ప్రజలను తీవ్రంగా మోసగించాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక హోదా దక్కుతుందన్నారు. గురువారం ఏలూరు వచ్చిన షర్మిల ఆశ్రం ఆసుపత్రి వద్ద కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. అనంతరం ర్యాలీగా ఏలూరు పాత బస్టాండ్ సెంటర్ నుంచి గన్ బజార్, ఆదివారపుపేట, తంగెళ్లమూడి సెంటర్, కండ్రికగూడెం సెంటర్ మీదుగా చింతలపూడి రోడ్డులోని సుఖీభవ కళ్యాణ మండపానికి చేరుకున్నారు. అక్కడ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ అప్పట్లో ప్రత్యేక హోదా కోసం పోరాడిన వాళ్లను చంద్రబాబు జైల్లో పెట్టించారని విమర్శించారు. ప్రత్యేక హోదా తాను తెస్తానని ఎన్నికల ముందు పాటపడిన జగన్ అధికారంలోకి వచ్చాక దాని ఊసే ఎత్తడం లేదన్నారు. వైసిపి, టిడిపి బిజెపి కనుసన్నల్లో పని చేస్తున్నాయన్నారు. అలాంటి పార్టీలను నమ్మవద్దని హితవు పలికారు. ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంట్, పోలవరం విషయంలో 22 మంది వైసిపి ఎంపీలు ఎందుకు మూకుమ్మడి రాజీనామాలు చేయడం లేదని ఆమె ప్రశ్నించారు. జగన్ అప్పు తెచ్చారు...అభివద్ధి ఉందా అని ప్రశ్నించారు. చంద్రబాబు అమరావతి అని చెప్పి సింగపూర్ కడతానని గ్రాఫిక్స్ చూపించారని, జగన్ మూడు రాజధానులని చెప్పి ఒక్కదానిని ఏర్పాటు చేయలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని, రానున్న 70 రోజులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విశ్రమించవద్దని కోరారు. కాంగ్రెస్ వస్తే ఏం జరుగుతుందో వివరించి రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరేద్దామన్నారు. సమావేశంలో నేతలు, మాజీ మంత్రులు జెడి.శీలం, పల్లంరాజు, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, అమర్ జహగేగ్, లాం తాంతియా, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మార్నీడి బాబ్జి, దంపుబోయిన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం చౌక్ వద్ద నిరసన తెలియజేస్తున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి హెచ్చరించారు. విజయవాడలో తలపెట్టిన ధర్నాకు అనుమతిని ప్రభుత్వం రద్దు చేసి యుటిఎఫ్ నాయకులకు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ భీమవరంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. సమస్యలు పరిష్కరిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చి తాత్సారం చేస్తోందన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని, ఉద్యోగోన్నతులు, బదిలీలు జరపాలని, సర్వీస్ రూల్స్ రూపొందించాలని, ఎస్‌జిటి, పండిట్ పిఇటి పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని, జిఒ 84 ద్వారా వచ్చిన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరిం చకుండా నిర్బంధం విధించడం అప్రజాస్వామికమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు డి.ఏసుబాబు, కె.శ్రీరామకృష్ణ ప్రసాద్, ఎస్.కుమార్ బాబ్జీ, సాయిరాం, జి.రామ కృష్ణరాజు, బి.నాగబాబు, కె.త్రిమూర్తులు, స్వామి, సుధాకర్, పాషా, వామనమూర్తి, బుచ్చిబాబు, శ్యామలరావు, నరేష్, విజయ్, తిలక్, రమణారావు, డేవిడ్, సీతారామ్, అంకరాజు, శ్రీను, సాయిరామ్, శ్రీనివాసు పాల్గొన్నారు.

పాలకొల్లు : మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. విజయవాడలో తలపెట్టిన ధర్నాకు అనుమతిని ప్రభుత్వం రద్దు చేసి యుటిఎఫ్ నాయకులకు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా సహాధ్యక్షులు కోరం రాజశేఖర్, జిల్లా కార్యదర్శి జి.లక్ష్మీనారాయణ, పి.క్రాంతి కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు కె.రాజశేఖర్, పిల్లి.శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి కె.త్రినాథ్, గౌరవాధ్యక్షులు జె.జయ దుర్గారావు పాల్గొన్నారు.

పథకాల అమలు ఘనత వైసిపిదే : ముదునూరి

ప్రజాశక్తి - మొగల్తూరు



రోడ్డును ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం మండలంలోని కెపిపాలెం, పేరుపాలెం గ్రామాల్లో సుమారు రూ.2.5 కోట్లతో పలు శంకుస్థాపనలు చేశారు. కెపిపాలెం నార్త్‌లో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలను, బొక్కగూడెంలో రూ.5 లక్షలతో నిర్మించిన స్లాబ్ కల్వర్టును, అదే గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన ఎస్‌సి కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. అలాగే రూ.47.60 లక్షలతో తాగునీటి సరఫరా అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. కెపిపాలెం సౌత్ గ్రామాల్లో రూ.90 లక్షలతో ఒఎచ్ఆర్, పైప్‌లైన్ ఏర్పాటు పనులకు, పేరుపాలెం నార్త్‌లో రూ.40.60 లక్షలతో, పేరుపాలెం సౌత్‌లో రూ.36.6 లక్షలతో తాగునీటి అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. పేరుపాలెం సౌత్ సెంట్రల్ ప్రాంతంలో సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో సర్పంచి కడలి సోంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వంటా వార్పు

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

పెనుమంట్ర మండలం ఆలమూరులో దళిత శ్మశానవాటిక సమస్యను తక్షణం పరిష్కరించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ తెలిపారు. ఆలమూరులో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ రెండు రోజులుగా మాల మహానాడు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం మార్టేరు, ఆలమూరు ఆర్అండ్‌బి ప్రధాన రహదారిపై వంటా వార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ రాజకీయాలకు దళితుల ఓట్లను వాడుకోవడం తప్ప అవసరాలు తీర్చే నాధుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్ఎకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని, లేనిపక్షంలో మాల మహానాడు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.



ఆలమూరులో రోడ్డుపై వంటా వార్పు నిర్వహిస్తున్న దళితులు

కులాన్ని బట్టి ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలి

శాసనమండలి చైర్మన్ మోషేనురాజుకు, ఎంఎల్ఏ గ్రంధికి దళితుల వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

షెడ్యూలు కులాలకు చెందిన (మాల, మాదిగ) వారికి మత విశ్వాసాలను బట్టి కాకుండా భారతీయ సాంప్రదాయాల్లో ఉంటూ కుల వివక్షతకు, అత్యాచారాలకు గురవుతున్న కులాలను బట్టి కులధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజుకు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎంఎల్ఏ గ్రంధి శ్రీనివాస్‌కు దళిత నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెసి రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా షెడ్యూల్ కులాల వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కృషి చేస్తున్నారన్నారు. మాల, మాదిగ సామాజిక తరగతులకు చెందిన వారందరికీ రాజ్యాంగం వీరికి కల్పించిన సదుపాయాలను పొందేందుకు కులాన్ని బట్టి కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని, ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఇదే విషయంపై ముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. కార్యక్రమంలో పాలపర్తి జోనా, పిల్లి మసలయ్య, పి.దేవదానం, బి.రమేష్‌బాబు పాల్గొన్నారు.



మోషేనురాజుకు వినతి పత్రం అందజేస్తున్న దళిత నాయకులు

పాలకొల్లు సిఐగా మంగాదేవి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణ సిఐగా డి.మంగాదేవి నియమితులయ్యారు. మంగాదేవి ఏలూరు రేంజ్ విఆర్ నుంచి పాలకొల్లు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన సిఐ డి.రాంబాబు ఏలూరు రేంజ్‌లో విఆర్‌కు బదిలీ అయ్యారు. పెనుగొండ సిఐ దేశంశెట్టి వెంకటేశ్వరరావు ఏలూరు డిసిఆర్‌ఎంకు బదిలీ అయ్యారు. కోనసీమ జిల్లాలో పనిచేస్తున్న సిఐ ఎన్.రజనీకుమార్ పెనుగొండ సిఐగా నియమితులయ్యారు. ఈ మేరకు ఏలూరు రేంజ్ డిఐజి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



జిల్లాస్థాయిలో జ్ఞానవర్షిత ప్రతిభ

ప్రజాశక్తి - పోడూరు

భేటీ బచావో - భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో సేవ్ ద గర్ల్ చైల్డ్ అంశంపై గత నెల ఎనిమిదో తేదీన నిర్వహించిన వక్తృత్వం, వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. వక్తృత్వంలో జిన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బొంతు కీర్తి జ్ఞాన వర్షిత జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి పొందిందని ప్రధానోపాధ్యాయులు సిహెచ్.శివజ్యోతి తెలిపారు. భీమవరం సిఎస్ఎన్ కళాశాలలో గురువారం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ వేడుకల్లో కీర్తిజ్ఞానవర్షితకు ఉన్నతాధికారులు రూ.ఐదు వేల నగదు బహుమతి, ప్రశంసపత్రం అందించారు. కీర్తిజ్ఞానవర్షితను గ్రామ సర్పంచి జమ్ము బేబీమహాలక్ష్మి, సొసైటీ ఛైర్మన్ డిటిడిసి బాబు, పిసి ఛైర్మన్ యడ్ల రమేష్ అభినందించారు.

కెరీర్ నెక్ట్స్ అంశంపై విద్యార్థులకు అవగాహన

భీమవరం రూరల్ :విశాఖపట్నం ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో భీమవరంలోని వెస్ట్ బెర్రీ స్కూల్‌లో కెరీర్ నెక్ట్స్ అంశంపై ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన హెూలిస్టిక్ లెర్నింగ్, కెరీర్ ఆప్షన్స్, ప్రొఫైల్ బిల్డిం గ్ అంశాలపై అవగాహన కల్పించారు. ఓక్రిడ్జ్ స్కూల్ యాజమాన్యం నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్తులో ఎటువంటి కెరీర్ ఆప్షన్స్ ఎంపిక చేసుకోవాలో నిపు ణుల ద్వారా సరైన మార్గదర్శకాన్ని తెలిపింది. భీమవరంలోని వెస్ట్‌బెర్రీ స్కూల్ ప్రిన్సి పల్ సారా స్మిత సాలి మాట్లాడుతూ ఓక్రిడ్జ్ స్కూల్ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి విషయాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు.

ఉండి ఎస్ఐగా లక్ష్మణ్

ఉండి :ఉండి నూతన ఎస్ఐగా మందపల్లి లక్ష్మణ్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో నూజివీడు, విస్సన్నపేట, ఆగిరిపల్లి, తిరువూరు, పెదవేగి పోలీస్‌స్టేషన్లలో పని చేశారు. లక్ష్మణ్‌కు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

బాధిత కుటుంబానికి పివిఎల్ పరామర్శ

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడు ఎంపిటిసి సభ్యులు చిన్నాపరపు రాంబాబు కుటుంబాన్ని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు గురువారం పరామర్శించారు. ఏలూరుపాడు గ్రామంలో ఎంపిటిసి సభ్యులు రాంబాబు మాతృమూర్తి చిన్నాపరపు రేవతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. రాంబాబు కుటుంబాన్ని వైసిపి గ్రామ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు, ఎంపిపి శిరీష విశ్వనాథరాజు, వైసిపి నాయకులు దాట్ల రామభద్రిరాజు, పడమట సతీష్, పచ్చిగోళ్ల శ్రీనివాస్, గంటా బాలు పరామర్శించారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రలు

ప్రజాశక్తి - గణపవరం

పోషకాహారం తీసుకోకపోతే రక్తహీనత ఏర్పడుతుందని కాశిపాడు ఆరోగ్య సహాయకులు నామాల రాజు అన్నారు. కాశిపాడు హైస్కూల్లో రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఐరన్ మాత్రలు అందించారు. ఈ సందర్భంగా నామాల రాజు మాట్లాడుతూ ఐరన్ మాత్రలు వాడడం వల్ల రక్తహీనత అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ఎఎస్ఎస్‌బిఆర్.ప్రసాద్, ఎఎన్ఎం శివకుమారి, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం నార్త్ గ్రామానికి చెందిన బిరజ వరలక్ష్మి అనారోగ్యానికి గురై సొంత నిధులు వెచ్చించి వైద్యం చేయించుకున్నారు. ఇటీవల ఆమెకు సిఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరయ్యాయి. రూ.5.50 లక్షల విలువైన చెక్కును చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు గురువారం వరలక్ష్మికి అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమల బాపూజీ, నాయకులు దొంగ నాగముని, కొల్లబత్తుల రవికుమార్, తిరుమని నరసింహస్వామి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మొగల్తూరు పంచాయతీ పరిధి కుక్కలవారితోటకు చెందిన జోగి మురళీకృష్ణ నరసాపురంలో నివాసం ఉంటున్నారు. ఆయన కుమారుడు క్రాంతికుమార్ (19) అక్కడే ఐటిఐ చదువుతున్నాడు. గురువారం కాలేజీ ముగిసిన అనంతరం మొగల్తూరులోని తన నానమ్మను చూసేందుకు ద్విచక్రవాహనంపై మొగల్తూరు బయలుదేరాడు. ఈ క్రమంలో సీతారాంపురం సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వెళు తున్న లారీ ఆకస్మాత్తుగా ఆగడంతో క్రాంతికుమార్ లారీని ఢీకొట్టి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. క్రాంతికుమార్ తండ్రి మురళీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాలుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి బాలికపై అత్యాచారానికి పాల్పడిన బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివన్నారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గంగడపాలెం గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన బాలుడు ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు బాలుడి బంధువుల వద్దకు వెళ్లి పెళ్లి చేసుకోవాలని అడిగారు. దీంతో వారిపై బాలుడి బంధువులు పదజాలంతో దూషించారని బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు బాలుడిపై పోక్సో నమోదు చేశారు.

పరిస్థితి విషమించి యువకుడు మృతి

ప్రజాశక్తి - యలమంచిలి

రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇలపకుర్రు గ్రామపంచాయతీ పరిధిలోని కుమ్మరిపాలేనికి చెందిన ఆకుమర్తి సోను (29) 20 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై భీమవరంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం పరిస్థితి విషమించి సోను మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలీని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - కాళ్ల

సీసలి గ్రామం పంట కాలవలో గుర్తు తెలీని మృతదేహాన్ని లభ్యమైంది. మృతుని వయసు 55 ఏళ్ల ఉంటుంది. సీసలి గ్రామ విఆర్ఓ గుర్రం చిట్టిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాళ్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

ఓటు హక్కు విలువను తెలుసుకోవాలి

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి - నరసాపురం



నరసాపురంలో...

ఓటు హక్కు విలువను, బాధ్యతను ప్రతి పౌరుడు తెలుసుకుని ఓటును వినియోగించుకోవాలని నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ ముఖ్యఅతిథిగా హాజరై మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావుతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆర్‌డిఒ కార్యాలయం నుంచి ప్రధాన జాతీయ రహదారి గుండా వెళ్లి థామస్ బ్రిడ్జి వద్ద మానవహారం నిర్వహించి ఓటు హక్కు అవగాహనపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌డిఒ అంబరీష్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం ఓటర్ల డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫజిల్, ఎంపిడిఒ ఎంవి.రమణారావు, డిటి నాగదేవి, మున్సిపల్, రెవెన్యూ శాఖ సిబ్బంది, సూర్య కాలేజీ, లెనిన్ హైస్కూల్, విద్యార్థులు పాల్గొన్నారు.

యర్రంశెట్టివారిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రాయల్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు చేతులమీదుగా విద్యార్థులకు వంద డిక్షనరీలు, వ్యక్తిత్వ వికాసం బుక్లెట్లు అందించారు. తొలుత విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస మోటివేషన్ క్లాస్‌ను ప్రొఫెసర్ చినిమిల్లి శ్రీనివాస్ నిర్వహించారు.

ఉండి :ఓటు హక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో 14వ ఓటర్ల దినోత్సవం కార్యక్రమాన్ని తహశీల్దార్ ఏడిద శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలంలో వివిధ పాఠశాలలో ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించి వయోవృద్ధులను సన్మానించారు. అనంతరం ఉండి తహశీల్దార్ కార్యాలయం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.రవీందర్, మండల విస్తరణ అధికారి అందే కొండలరావు, డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరాస్వామినాయుడు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆచంట :ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. మండలంలోని ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం గ్రామాల సచివాలయాల్లో జాతీయ ఓటర్ దినోత్సవం వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరుచే ప్రతిజ్ఞ చేసి అనంతరం సీనియర్ ఓటర్లు నెక్కంటి రామశేఖర్, వట్టి ముత్యాలు, పారంశెట్టి సుబ్బారావులను ఘనంగా సత్కరించారు.

పోడూరు : జాతీయ ఓటర్ల దినోత్సవం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. కొత్తగా ఓట్లు వచ్చిన ఓటర్లకు గుర్తింపు కార్డులు అందించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి.సుహాసిని, డిటి రాజేష్, ఆర్ఐ కె రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ త్రిమూర్తులు, విఆర్ఓ ఎస్.కుమార్, సునీల్ పాల్గొన్నారు.

గణపవరం : స్థానిక డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ లక్ష్మి మాట్లాడారు. అనంతరం కాలేజీ విద్యార్థులతో గణపవరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణపవరం ఉప సర్పంచి, వైసిపి మండల కన్వీనర్ దండు రాము, కాలేజీ వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, ఎంఇఒ పి.శేషు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి అధ్యక్షత వహించారు. మున్సిపల్ టిపిఒ కె.వీరబ్రహ్మం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, కళాశాల, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ అధ్యక్షత వహించగా, కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్ ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లు మాఘం బాలకొండలరావు, కెవిఎల్.నరసింహరాజు, ఆకి రామకృష్ణ, కారుమూరి రామలింగేశ్వరరావులను సత్కరించారు.

తణుకు రూరల్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు అధికారులందరూ ర్యాలీగా వెళ్లి జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేసి, మానవహారం నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి బివి.రమణ, ఇఆర్ఒ వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఉత్తమ ఉద్యోగి, సూపర్‌వైజర్స్, బిఎల్ఒలకు అవార్డులు, క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో బహుమతులు అందించారు.

పెనుగొండ : పెనుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి నక్కా శ్యామలా సోనీ అధ్యక్షతన ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సీనియర్ ఓటర్ కంబాల నాగేశ్వరరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని పెన్మత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సీనియర్ ఓటర్లను రెవెన్యూ అధికారులు సత్కరించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై గ్రామంలో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.అనితకుమారి, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు వర్ధమాని రవిశంకర్ సర్కార్, ఆర్ఐ శిరీష, విఆర్ఒ వెంకటలక్ష్మి, మహిళా పోలీస్ సుధారాణి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పంట బోదె ప్రక్షాళన

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని పెనుమంచిలి, ఆచంట వేమవరం రహదారి పక్కనున్న పంట బోదె ప్రక్షాళణ అధికారులు చేపట్టారు. నీరందదు.. సాగు సాగదు శీర్షికన ప్రజాశక్తితో ఇటీవల ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంట బోదెలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని యంత్రాలతో తొలగించే కార్యక్రమం గురువారం చేపట్టారు. దీంతో సాగు నీటికి ఆటంకం లేకుండా దాళ్వా ఉడుపుల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

భోజనశాల ప్రారంభం

ఉండి :దాతల సహకారంతో భోజనశాలను నిర్మించుకోవడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. మండలంలోని చెరుకువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.17 లక్షలతో నిర్మించిన భోజనశాలను ఆయన గురువారం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు గాదిరాజు వెంకట రామకృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్‌పిటిసి సభ్యులు రణస్థల కనకదుర్గ మహంకాళి, సర్పంచి కొండవీటి సాంబశివరావు, కెనరా బ్యాంక్ ఎజిఎం తోట రవిచంద్ర మాట్లాడారు. ప్రధాన దాత కెనరా బ్యాంక్ సిఇఒ కలిదిండి సత్యనారాయణరాజు ఈ ప్రాంతవాసి కావడం గ్రామ ప్రజల అదృష్టమన్నారు. ఈ సహాయం అందటానికి ముఖ్యంగా వారి సోదరీమణి సుబ్బలక్ష్మి కృషి అనిర్వచనీయమన్నారు.

నేడు ట్రాక్టర్ల ర్యాలీ

భీమవరం :కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ శుక్రవారం నిర్వహించే ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలని అఖిల భారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షులు లంక కృష్ణమూర్తి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విస్సాకోడేరు నుంచి భీమవరం టౌన్ చుట్టుపక్కల ఈ ర్యాలీని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో రైతులు, కార్మికులు, వివిధ రైతు సంఘాలు పాల్గొంటాయన్నారు. స్వామినాథన్ సిఫార్సులు అమల చేయాలని, ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని, వ్యవసాయ రుణాలు రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టవద్దని కోరుతూ నిరసన తెలియజేస్తున్నామని తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

తణుకు రూరల్ :గత నాలుగున్నరేళ్లుగా పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తణుకు యూనిట్ అధ్యక్షులు, కార్యదర్శి కాయల నాగేశ్వరరావు, ఎస్.చలపతిరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘ(ఎస్‌జిపిఎ) తణుకు యూనిట్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 29వ తేదిన భీమవరం కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. అప్పటికీ పరిష్కరించకపోతే ఫిబ్రవరి 5వ తేదీన విజయవాడలో రాష్ట్ర వ్యాప్త ధర్నాకు రాష్ట్ర సంఘం పిలుపునిచ్చినట్లు తెలిపారు.

చించినాడలో లెనిన్ భారీ ఫ్లెక్సీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రపంచ విప్లవ వీరుడు లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని చించినాడ గ్రామంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో లెనిన్ నిలువెత్తు భారీ ఫ్లెక్సీని గురువారం స్థానిక సుందరయ్య పార్కు వద్ద ఆవిష్కరించారు. డివైఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు కానేటి బాలరాజు చేతుల మీదుగా ఈ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోవియట్ రష్యాలో ప్రపంచంలోనే మొట్టమొదటి సోషలిస్టు ప్రభుత్వాన్ని లెనిన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారన్నారు. అటువంటి మహనీయుని ఫ్లెక్సీని డివైఎఫ్ఐ సంఘం ఆధ్వర్యంలో చించినాడలో ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తెన్నేటి స్టాలిన్, మూరాల జైసింగ్, జిల్లెళ్ల శేఖర్, తెన్నేటి శివాజీ, పల్లేరు అనిల్, ఆకుమర్తి జోసెఫ్‌రాజు పాల్గొన్నారు.


ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని దిగమర్రులో కేంద్ర ప్రభుత్వ సహాయ నిధులతో జలజీవన్ మిషన్ పనులకు ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవికి ఎక్కడ తాగునీటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ముందుగానే చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు, గ్రామ సర్పంచి రాపాక నగేష్ కరుణాకర్, యడ్ల తాతాజీ, జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవిందరాజులు నాయుడు, రాపాక సుని, గుమ్మాపు పెద్దిరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట : గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి సిఎం జగన్ పెద్దపీట వేశారని, ఇందులో భాగంగా గత నాలుగున్నరేళ్లుగా భీమవరం నియోజకవర్గాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రాయలం గ్రామంలో రూ.5.47 కోట్ల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను, డ్రెయిన్లను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం మరికొన్ని అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, ఎంపిడిఒ వెంకటలక్ష్మి, పంచాయతీరాజ్ డిఇ స్వామినాయుడు, చిన్నమిల్లి వెంకటరాయుడు, చిన్నమిల్లి నాగన్న, చిన్నమిల్లి శ్రీనివాస్, అడబాల అర్జున్‌రావు, చెల్లబోయిన బుజ్జి, కండిబోయిన వాసు, కౌరు పాండురంగారావు, విప్పర్తి దొరబాబు, వీరమల్లు రాజకుమార్, యాడంగి రవి పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దుకు పోరాడాలి

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రజా వ్యతిరేక భూహక్కు చట్టాన్ని రద్దు చేసే వరకూ సమన్వయంగా పోరాడుదామని పలువురు న్యాయవాదులు పిలుపునిచ్చారు. భీమవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆకివీడులో గురువారం ప్రజా చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అడ్వకేట్, భీమవరం బార్ అసోసియేషన్ జెఎసి కన్వీనర్ నీలాద్రి రమేష్ అధ్యక్షత వహించారు. సీనియర్ అడ్వకేట్ బొక్క దామోదరరావు మాట్లాడుతూ ఈ చట్టం రద్దు చేయకపోతే ప్రజలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు ఉండవల్లి రమేష్‌నాయుడు, కెవి.రమేష్, నెల్లి సతీష్‌దుర్గాప్రసాద్, మజ్జి నాగరాజు, స్థానిక ప్రముఖులు మాజీ సర్పంచి గొంట్ల గణపతి, జనసేన నాయకులు తోట వాసు, గవర అనిల్ పాల్గొన్నారు.

'ప్రజలను మోసగిస్తున్న జగన్'

తణుకు :రాష్ట్ర ప్రజలను సిఎం జగన్ మోసగిస్తున్నారని తణుకు మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం ఆయన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసరా పేరుతో మహిళలకు టోకరా వేస్తున్నారని, డ్వాక్రా రుణమాఫీ జగన్నాటకమైందని విమర్శించారు. మహిళలను ఆదుకున్నది తెలుగు దేశం ప్రభుత్వమేనన్నారు. రానున్న రోజుల్లో మహిళ శక్తి ద్వారా టిడిపి ఆదుకుంటుందన్నారు. నియోజకవర్గంలో స్థానిక మంత్రి మహిళలను అవహేళనగా మాట్లాడుతూ అన్ని విధాలుగా అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు.

వైఎస్ఆర్, రంగా విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - అత్తిలి

కులమతాలకు అతీతంగా పేద ప్రజల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడి మహనీయులైన వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, వంగవీటి మోహనరంగా విగ్రహాలను ఒకేచోట నెలకొల్పడం చాలా ఆనందంగా ఉందని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి సంతమార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, వంగవీటి మోహనరంగా విగ్రహాలను ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబుతో కలిసి ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్.రాజశేఖరరెడ్డి, వంగవీటి మోహనరంగా లేని లోటు ప్రజలకు తీరనిదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య, అత్తిలి ఎఎంసి ఛైర్మన్ బుద్ధరాతి భరణిప్రసాద్, వైసిపి మండలాధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపిపి మక్కా సూర్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు అడ్డాల జానకి, సర్పంచి గంటా విజేతనాగరాజు, ఉపసర్పంచి మద్దాల శ్రీనివాస్, ఎఎంసి మాజీ ఛైర్మన్లు కూనపరెడ్డి జయరాజు, కందుల సత్యనారాయణ, జెడ్‌పి కో ఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, తణుకు నియోకవర్గ పరిశీలకుడు జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్, వైసిపి మండల నాయకులు పాల్గొన్నారు.

అవినీతిపై నిగ్గు తేల్చకపోతే నిరాహారదీక్ష : బండారు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం గోదావరి ఏటిగట్టు పనుల్లో జరిగిన అవినీతిపై నిగ్గు తేల్చకపోతే నిరాహారదీక్ష చేపడతానని టిడిపి మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు అన్నారు. నరసాపురం పొన్నపల్లిలో జరుగుతున్న ఏటిగట్టు పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చీఫ్ విప్, ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు ఏటిగట్టు పనులను బినామీ కాంట్రాక్టర్ పేరుతో నిర్వహిస్తూ రూ.కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. ఎంఎల్‌ఎ ఏటిగట్టు పనుల అంచనాలను ఇంకా పెంచి ఎటిఎంలా ఉపయోగించుకుంటున్నారన్నారు. నాణ్యత లోపంపై విజిలెన్స్, ఉన్నతాధికారులు స్పందించకపోతే ఒకటో తేదీ నుంచి ఉద్యమిస్తామని చెప్పారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు అయిన ఏలూరు ఆర్.ఆర్.పేట వాస్తవ్యులు **షేక్ మస్తాన్ భాష, S/o. సిలార్** నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం,

నా క్లయింటు అంజుమన్-యి-మెఫజుల్, ఏలూరు సంస్థలో X-E.C నెంబరు అయి వున్నారు. ప్రస్తుతం ఉన్న ఎడహక్ కమిటీ సభ్యులు సంస్థ యొక్క బైలాకు వ్యతిరేకంగా కొత్త సభ్యులకు సంస్థలో మెంబర్‌షిప్ యిచ్చినట్లు తెలియ వచ్చినది.

సదరు కొత్త సభ్యులకు మెంబర్‌షిప్ యిచ్చుటకు ఎడహక్ కమిటీకు బైలా ప్రకారం ఎటువంటి హక్కులు లేవనియు, సదరు కొత్త సభ్యుల సభ్యత్వాలు చట్ట ప్రకారం చెల్లవనియు, సదరు కొత్త సభ్యులు జరగబోయే ఎలక్షన్ ప్రాసెస్ నందు పాల్గొనుటకు అనర్హులు అనియు, అట్లు పాల్గొనిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని ఈ పబ్లిక్ నోటీసు ద్వారా తెలియచేయడమైనది.

G.V.ANAND KUMAR, Advocate
Eluru, Cell: 9848427001

మహారాజశ్రీ కొవ్వూరు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు

I.A. No. 479/2023
O.S. No. 390/2022

Between:
వీరమలు జ్యోతి ప్రభాకర వెంకటేశ్వరరావు **-వాది**
మరియు
బాలిన లక్ష్మి మరియు 2 ఇతరులు **-ప్రతివాదులు**

పై నెంబరు దావాలో 3వ ప్రతివాది అయిన మట్టా సుజన కి రిజిష్టర్ పోస్టు మరియు కోర్టు వారి ద్వారా దావా సమన్లు అమలు కానందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా **ది. 14-2-2024వ తేదీన వాయిదా అయ్యి ఉన్నదని, ఆరోజు ఉదయం 10.30 గంటలకు** మట్టా సుజన, D/o. సత్యనారాయణ, వయస్సు 43 సంవత్సరాలు, హిందు, స్త్రీ, గృహిణి, R/o. D.No. 2-87, తారకరామ నగర్, ప్రభుత్వ జూనియర్ కాలేజి దగ్గర, కొయ్యలగూడెం గ్రామం మరియు మండలం, ఏలూరు జిల్లా అనువారు స్వయంగా గాని, లేక వకీలు ద్వారా గాని శ్రీ కొవ్వూరు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు హాజరు కావలసియున్నదని, అలా కాని పక్షమున కేసు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

B.PRASADA RAO, Advocate
Tallapudi, Cell: 9912426144

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, తణుకు, ప॥గో॥జిల్లా కోర్టులో

ఈ.పి. నెం. 61/2022 ఇన్
ఓ.యస్. నెం. 436/2020

బిట్వీన్:
పడాల శ్రీనివాసరెడ్డి **-డి. హెచ్. ఆర్.**
మరియు
షేక్ సుభాన్ సాహెబ్ అనే సుభాన్ **-జె. డి. ఆర్.**
తండ్రి: షేక్ యూసఫ్ సాహెబ్, డోర్ నెం. 2-131, పంచాయితీ ఆఫీస్ వెనుక, సిద్ధాంతం - 534326, పెనుగొండ మండలం, ప॥గో॥జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు.

డి. హెచ్. ఆర్. తరపున దాఖలు చేసిన ప్రకటన

ది. 09-05-2022 గల డిక్రీ బాకీ మీ ఆస్తి జప్తు, దర్మిలా వేలం వేసి వసూలు చేయుటకు దాఖలు చేయగా మీకు నోటీసులు అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు ఆర్డర్ వేసినారు. కావున **ది. 19-02-2024 ఉదయం 10.30 గం॥లకు** మీరు పై కోర్టు ఎదుట హాజరు కాని ఎడల మీ పరోక్షమునందు ఈపి తీర్మానం జరుగునని తెలియజేయడమైనది.

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీ గోటేటి సత్య వెంకట వరప్రసాద్
తణుకు అడ్వకేట్స్, తణుకు, ప॥గో॥జిల్లా
ది.24-1-2024 సెల్:9390018122

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరులో

F.O.P. 12/2023 in **O.S. 179/2012**

బిట్వీన్:
ఇండియన్ బ్యాంకు, పెదవేగి **-పిటీషనర్**
AND
శ్రీ నెక్కలపూడి సోమశేఖర్ మరియు ఇతరులు **-డిఫెండెంట్స్**

To:
R-1: నెక్కలపూడి సోమశేఖర్, S/o. రామచంద్రరావు, తాళ్ళ గోకవరం, పెదవేగి మండలం, ఏలూరు జిల్లా.

పై నంబరు ఫైనల్ డిక్రీ పిటిషన్‌లో పైన ఉదహరించిన 1వ రెస్పాండెంటు హాజరు నిమిత్తం ది. 16-2-2024వ తేదీన వాయిదా అయి వున్నది. కావున 1వ రెస్పాండెంటు వాయిదా రోజు అనగా **ది. 16-2-2024న ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరు కావలెను. లేని ఎడల 1వ రెస్పాండెంటు పరోక్షంలో ఫైనల్ డిక్రీ ఫిటీషన్ తీర్మానించబడును.

B.GOWRI SANKAR
Advocate, Eluru
Cell: 7416236226

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పాలకోడేరు మండలం, పాలకోడేరు ఎ.ఎస్.ఆర్.నగర్, డోర్ నెం. 11-14 కి చెందిన దేవవరపు లక్ష్మి, తండ్రి: దేవవరపు సుబ్బారావు అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **M6754905** నెంబర్ గల ఒరిజినల్ పాస్‌పోర్టును కవరులో పెట్టుకొని మా ఇంటి వద్ద నుండి ది. 02-1-2024వ తేదీన పాలకోడేరు మెయిన్‌రోడ్డు వద్ద గల జిరాక్స్ షాపునకు జిరాక్స్ తీసుకొనుటకు మోటారు సైకిల్ పైన వెళుచుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

దేవవరపు లక్ష్మి,
D/o. దేవవరపు సుబ్బారావు
డోర్ నెం. 11-14, ఎ.ఎస్.ఆర్. నగర్
పాలకోడేరు, పశ్చిమగోదావరి జిల్లా

IN THE COURT OF THE HON'BLE XV ADDL DISTRICT JUDGE :: AT NUZVID :: PUBLICATION OF NOTICE UNDER ORDER 5 RULE 20 OF C.P.C

IA. NO: 1467 OF 2023 IN
G.L.No. : 3509 OF 2023 IN
IA. NO: OF 2023 IN OS: 68 OF 2017

BETWEEN
Noel Harper - Petitioner / Defendant
AND
Ponnam. Nagaraju & Others
- Respondants / Plaintiffs

Notice to : Ponnam . Haribabu, S/o Late Ramachandraiah, Aged 39 years, Flat No. 106, Ammapadam Apartment, Near Darga, Bhavanipuram, Vijayawada, Krishna District.

PETITION FILED UNDER ORDER XVI RULE 1A r/w 151 CPC

Whereas it is proved to the satisfaction of the court that the GPA Ponnam Haribabu who instituted the suit on behalf of Plaintiffs, notices cannot be served in the ordinary way of service as the returned endorsements of registered posts are 'no such person in the address'. Hence, this proclamation under order 5 rule 20 of CPC is hereby is issued against him and he should appear personally or through their counsel on 30.01.2024 at 10.30 AM. Take Notice that, in default of his appearance on the day before mentioned, the above said case will be heard and determined in his absence.

Order by the court on 25-01-2024.

Forwarded by :
Murala. Gopinadh
Advocate

SD/- Hon'ble XV Additional District Judge,Nuzvid.

IN THE COURT OF THE HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE: ELURU

E.P.No. 322/2011
in O.S.No.348/2007

Between :
Golla Yalamanda Rao -DHR/plaintiff
And
Sri. Lanka Srinivasa Rao and another -JDRs/Defendants

పై నెంబరు గ్రంధములో డిక్రీ బాకీ వసూలు కొరకు జెడిఆర్/ప్రతివాదులు యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములు గల ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది.08-02-2024వ తేదీన ఉదయం 10-30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడును. యావన్మంది వేలంపాటలో పాల్గొని పాడుకోవచ్చును. కోర్టు వారి షరతులు వర్తించును.

షెడ్యూలు ఆస్తి వివరము : పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు సబ్-రిజిస్ట్రారు యిలాకా, ఏలూరు నగరం, టి.యస్.నెం. 1572, పాత అసెస్‌మెంట్ నెం. 3294 దాఖలా చ.గ.130లు అందులో గల పెంకుటిల్లు నెం. 3బి-3-8కు హద్దులు ::
దక్షిణం - శ్రీ వేంకటేశ్వరస్వామి గుడి తాలూకు ఆస్థి
తూర్పు - డి.మధుసూధనరావు ఆస్థి
పడమర- మున్సిపల్ బజారు
ఉత్తరం - ఆర్.లక్ష్మణరావు ఆస్థి
ఈ హద్దుల మధ్య సుమారు 130 చ.గ.ల ఇంటి స్థలం, అందలి పెంకుటిల్లుతో సహా వేలం వేయుదురు.
డిహెచ్ఆర్ విలువ : రూ.2,00,000/-
అమీనా విలువ : రూ.7,50,000/-

ఇట్లు :
ఈద్పుగంటి శ్రీనివాసబాబు,
అట్లూరి రవికుమార్,
అడ్వకేట్స్, ఏలూరు,
08812-239498
ఏలూరు
తేది: 22-01-2024